# చేవెళ్ల గడ్డపై.. బీసీల సత్తా చాటుదాం

**బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌కే మా సంపూర్ణ మద్దతు**

**అహంకారపూరిత నేతలకు చరమగీతం పాడుదామని పిలుపునిస్తున్న బీసీ నేతలు**



చేవెళ్ల లోక్‌సభలో బీసీలకు వచ్చిన అవకాశాన్ని చేజార్చుకోవద్దని బీసీ సంఘాలు పేర్కొంటున్నాయి. కాంగ్రెస్ పాలనలో బీసీలు ఎదుర్కొన్న కష్టాలను తల్చుకుని నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీసీ అభ్యర్థిని గెలిపించుకోకపోతే ఎదురయ్యే పరిస్థితులు ఊహించుకుంటేనే భయంగా ఉందని ఆందోళన వెలిబుచ్చుతున్నారు. ఈ ఎన్నికల్లో బీసీల సత్తా చూపి అహంకారపూరిత నేతలకు చరమగీతం పాడుదామని పిలుపునిస్తున్నారు. చేవెళ్లలో బీసీలకు అందివచ్చిన ఈ అవకాశాన్ని బీసీల్లోని అన్ని కులాలవారు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ వర్గాలకు ఇచ్చిన ప్రాధాన్యత.. లోక్‌సభ ఎన్నికల్లో టికెట్ల కేటాయింపులో బీసీలకు కల్పించిన ప్రాధాన్యతను నేతలు ఈ సందర్భంగా కొనియాడుతున్నారు. బీసీలను అణచివేయాలని చూస్తున్న కాంగ్రెస్, బీజేపీ పార్టీలను నమ్మేది లేదని స్పష్టం చేస్తున్నారు. ఎన్నికల వేళ మాయమాటలు చెప్పి మభ్యపెట్టే ప్రయత్నాలు చేసినా.. తిప్పికొట్టి బీసీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామని స్పష్టం చేస్తున్నారు. అన్ని కులాలు ఐక్యంగా ఉండి కాసానిని ఎంపీగా పార్లమెంటులో కూర్చోబెడతామని కుండబద్దలుకొట్టి మరీ చెబుతున్నారు.

- రంగారెడ్డి, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ)

### మన బీసీ నాయకుడికి ఓట్లు వేసి గెలిపించుకుందాం

బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి మన బీసీ నాయకుడికే ఓట్లు వేసి గెలిపించుకుందాం. ఎంపీగా జ్ఞానేశ్వర్ గెలుపొందితేనే పార్లమెంట్‌లో మన సమస్యలపై పోరాటం చేసి మనకు న్యాయం చేస్తారు. కొండా, గడ్డం ఎంపీలుగా గెలిచి సొంత ప్రయోజనాల కోసం బీఆర్ఎస్‌ను వదిలి ఇతర పార్టీల్లోకి వెళ్లారు. ఈ ఎన్నికల్లో కాసాని గెలుపొందడం ఖాయం.

– మహేశ్, చేవెళ్ల మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్

### బీసీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కాసాని జ్ఞానేశ్వర్‌ను పార్టీ అభ్యర్థిగా పోటీ చేయించడం సంతోషకరమైన విషయం. బీసీలను చులకనగా చూస్తున్న నేతలను ఓడించి మన సత్తా చూపిద్దాం. బీసీలకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీలకు పట్టం కట్టాల్సిన అవసరం ఉన్నది. పార్టీలకతీతంగా బీసీలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలి.

– ఇమ్రాన్, సింగప్పగూడ, చేవెళ్ల మండలం

### చేవెళ్లను బీసీల అడ్డాగా మారుస్తాం

జ్ఞానేశ్వర్ గెలుపుతో బీసీలకు రాజకీయ గుర్తింపు వస్తుంది. మరింత అభివృద్ధి చెందాలంటే కాసానికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాల్సిన అవసరం ఉన్నది. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలమంతా ఏకతాటిపైకి వచ్చి, కాసానిని గెలుపించుకొని చేవెళ్లను బీసీల అడ్డాగా మారుస్తాం. కేసీఆర్ బీసీలకు 50 శాతం టికెట్లు ఇవ్వడం చాలా సంతోషంగా ఉన్నది.

– ప్రవీణ్, మాసన్‌పల్లి, బషీరాబాద్

### మంచి అవకాశం

బీసీలంతా ఒక్కతాటిపైకి వచ్చి బీసీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలుపించుకునేందుకు ఇది మంచి అవకాశం. కాసాని అంటేనే బీసీ కులాలు గుర్తుకు వస్తాయి. బీసీ కులాలను ఏకం చేసిన కాసానిని పార్టీలకతీతంగా ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలి. బీసీల సత్తా దేశవ్యాప్తం కావాలంటే కాసాని గెలుపు ఒక్కటే మార్గం.

– అంజిలప్ప, ఇందర్‌చేడ్, బషీరాబాద్ మండలం

### బీసీలంతా ఏకమవ్వాలి

బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపునకు బీసీలంతా ఏకమవ్వాలి. స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజల నమ్మకాలతో ఆడుకునే వ్యాపారవేత్తలకు తగిన బుద్ధి చెబుతూ బీసీల బలాన్ని ఢిల్లీ వరకు తెలిసేలా చేద్దాం. బీసీలతో పాటు మిగతా వర్గాల ప్రజలు సైతం కాసాని గెలుపునకు మద్దతుగా నిలువడం ఖాయం. చేవెళ్ల గడ్డపై ముచ్చటగా మూడోసారి గులాబీ జెండా ఎగరడం పక్కా.

– మల్లేశ్, చందానగర్

### బీసీ నాయకుడిని గెలిపించుకుందాం

బీసీల సంక్షేమం కోసం ఏండ్లుగా పోరాడుతున్న నేత కాసాని జ్ఞానేశ్వర్. ఆయనను భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు పలుకుతున్నారు. వ్యాపారాలు, స్వార్థ రాజకీయాలతో పదవి కోసం పాకులాడే నాన్ లోకల్ లీడర్లకు ఎన్నికల్లో పరాభవం తప్పదు. బీసీలందరూ అప్రమత్తంగా ఉండి కాసాని గెలుపునకు కృషిచేద్దాం.

– శంకరి రాజు ముదిరాజ్, శేరిలింగంపల్లి

### మన ఓటు మనమే వేసుకుందాం

మన ఓట్లు మనమే వేసుకొని బీసీల సత్తా చాటుదాం. బీసీలను తక్కువ చేసి మాట్లాడుతున్న వారికి ఓటుతో బుద్ధి చెబుతాం. బీసీలను గుర్తించి చేవెళ్ల పార్లమెంటుకు బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎంపీ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్‌కు టికెట్ ఇవ్వడం శుభ పరిణామం. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బీసీలకు సముచిత స్థానం కల్పించారు.

– యాతం బాల్‌రాజ్ యాదవ్, సంఘం నాయకుడు, బడంగ్‌పేట

### గులాబీ జెండాను ఎగురవేద్దాం

చేవెళ్ల పార్లమెంటు గడ్డపై గులాబీ జెండాను ఎగురవేద్దాం.. బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపీ అభ్యర్థిగా గెలిపించి పార్లమెంట్‌కు పంపుదాం. బీసీ వాణి, బాణిని వినిపించే ఏకైక గొంతుక కాసాని. గతంలో బీసీల కోసం అనేక ఉద్యమాలు చేశారు. బీసీల కోసం సంవత్సరాల తరబడి పోరాటం చేసిన కాసానికి ఒక్కసారి అవకాశం ఇద్దాం.

– కిరణ్, బీసీ సంఘం నాయకుడు, బడంగ్‌పేట

### కాసానితో బీసీలు ఆర్థికంగా ఎదిగారు

బీసీల సంక్షేమం కోసం కృషిచేసిన వ్యక్తి కాసాని జ్ఞానేశ్వర్. ఆయన చేసిన పోరాటాల ఫలితంగా ఎంతో మంది బీసీలు ఆర్థికంగా ఎదిగారు. ఉమ్మడి రంగారెడ్డిజిల్లా చైర్మన్‌గా పనిచేసి మంచి పేరు తెచ్చుకున్న నాయకుడు జ్ఞానేశ్వర్. అలాంటి వ్యక్తికి ఎంపీ టికెట్ కేటాయించిన కేసీఆర్‌కు ధన్యవాదాలు. బీసీలందరూ ఐకమత్యంగా కలిసి ఎలాగైనా కాసానిని గెలిపించుకుంటాం.

– పరమేశ్, అత్తాపూర్

### ఇంటింటికీ తిరిగి బీసీల మద్దతు కూడగడతాం

బడుగు బలహీన వర్గాల అభ్యన్నతికి పాటుపడిన బీసీ నేత కాసానిని చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా బీఆర్ఎస్ ప్రకటించడం హర్షణీయం. ఇంటింటికీ తిరిగి బీసీల మద్దతు కూడగడతాం. బీసీలందరూ కారు గుర్తుకు ఓటువేసేలా ప్రచారం చేస్తాం. బీసీ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవాలి.

– రాము యాదవ్, హైదర్‌గూడ

### బీసీల సత్తా చూపిస్తాం

బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలకు సముచిత ప్రాధాన్యత ఇచ్చి గౌరవించింది. ప్రస్తుతం ఎంపీ అభ్యర్థిగా బీఫామ్ ఇచ్చి గౌరవించారు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. జనాభాలో సగభాగం ఉన్న బీసీలందరూ కాసానీ జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవడం ఒక్కటే మిగిలి ఉన్నది. బీసీలతో పాటు ఇతర కులాలు కూడా జ్ఞానేశ్వర్ గెలుపునకు కృషి చేయాలి.

– ప్రశాంత్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, పూలపల్లి

### బీసీ నేతకు పట్టం కడుతాం

చేవెళ్ల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్‌కు పట్టం కడుతాం. బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి కేసీఆర్ టికెట్ కేటాయించారు. ఆయనను గెలిపిస్తే సామాజికంగా న్యాయం జరుగుతుంది. కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ సత్తా చూపిస్తాం. బీసీలకు న్యాయం జరిగేందుకు బీసీ నాయకుడిని గెలిపించుకోవాలి.

– మాలె కృష్ణయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ, కులకచర్ల

### కాసాని గెలిస్తేనే సమస్యల పరిష్కారం

కాసాని బడుగు బలహీనవర్గాల ప్రజలకు అండగా ఉంటారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి నిలబెట్టిన జ్ఞానేశ్వర్‌కు ప్రతి ఒక్కరి మద్దతు ఉంటుంది. కాసాని గెలుపు కోసం మా వంతు కృషిచేస్తాం. కాసాని గెలిస్తేనే కేంద్రంలో బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కృషిచేసేందుకు అవకాశముంటుంది. జ్ఞానేశ్వర్ మచ్చలేని నాయకుడు.

– గుండుమల్ల నర్సింహులు, తిర్మలాపూర్, కులకచర్ల మండలం

### బీసీ బిడ్డను గెలిపించుకుందాం

బీసీలను ఏకం చేసిన నాయకుడు కాసాని. రాష్ట్రంలో 96 కులాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి వారి సమస్యలపై పోరాటం చేసిన ఘనత జ్ఞానేశ్వర్‌కు దక్కుతుంది. అలాంటి నాయకుడిని గుర్తించిన కేసీఆర్ ఎంపీ అభ్యర్థిగా ఆవకాశం కల్పించడం గొప్ప పరిణామం. బీసీల సమస్యలు పరిష్కారం కావాలంటే కాసాని ఎంపీగా గెలవాల్సిందే.

– శ్రీనివాస్‌గౌడ్, నారాయణపూర్, వికారాబాద్

# ఎంపీగా పద్మారావుగౌడ్‌ను గెలిపిద్దాం

ఎల్ఎన్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 22: సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆదేశాల మేరకు యూసుఫ్‌గూడ కార్పొరేటర్ బండారి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. పేదల పక్షాన ఢిల్లీలో గళమెత్తేందుకు సికింద్రాబాద్ ఎమ్మెల్యే టి.పద్మారావుగౌడ్‌కు మద్దతుగా సోమవారం లక్ష్మీనరసింహనగర్‌లో ప్రచారం చేశారు. పార్టీ నాయకుడు షబ్బీర్‌తో కలిసి ఓటర్లను కలిశారు. పద్మారావుగౌడ్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ యూసుఫ్‌గూడ డివిజన్ ప్రధాన కార్యదర్శి నర్సింగ్‌దాస్ ఆధ్వర్యంలో నాయకులు తలారి వెంకటేశ్, మాదాస్ వేణుగోపాల్, కె.సంతోష్, రాజు, దారా స్రవంతి, అమ్మాజీ, నాగరాజ్ తరుణ్, డి.రజిత, గోపాలస్వామి, పల్లె నాగ, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**కష్టపడి పనిచేద్దాం.. జ్ఞానేశ్వర్‌ను గెలిపిద్దాం..**

మణికొండ: చేవెళ్ల లోక్‌సభ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ విజయం కోసం పార్టీ శ్రేణులు కష్టపడి పని చేద్దామని మణికొండ మున్సిపాలిటీ ఆ పార్టీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కాసాని జ్ఞానేశ్వర్ నామినేషన్ వేయనున్న నేపథ్యంలో మణికొండ మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు బుద్దులు శ్రీరాం అధ్యక్షతన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో మాజీ ఎంపీపీ తలారి మల్లేశ్, కౌన్సిలర్లు నవీన్‌కుమార్, బుదోలు కావ్యశ్రీరాములు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి

### బంజారాహిల్స్‌లో హెచ్‌వీఏసీ ఎక్స్‌పీరియన్స్ సెంటర్

ప్రముఖ ఎయిర్‌కండిషనర్ ఉపకరణాల సంస్థ హిసాన్సె ఉత్పత్తులను అందించేందుకు బంజారాహిల్స్ రోడ్ నం.2లో ఆర్థస్ హెచ్‌వీఏసీ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను సోమవారం సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నవనీత్‌రెడ్డి, డైరెక్టర్ రాకేశ్‌చౌహాన్ ప్రారంభించారు. తమకు నచ్చిన ఎయిర్ కండిషనర్లను ఎంపిక చేసుకునేందుకు ముందుగానే వాటి పని తీరును నేరుగా పరిశీలించేందుకు ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని వారు పేర్కొన్నారు.

– బంజారాహిల్స్

### ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన

వెంగళరావునగర్, ఏప్రిల్ 22: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయినిగమాగమంలో క్రాఫ్ట్స్ అండ్ వీవర్స్ అర్టిసన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో-2024 పేరిట ఏర్పాటుచేసిన సిల్క్ ఎగ్జిబిషన్ అమితంగా ఆకట్టుకుంటుంది. ఈ వస్త్ర ప్రదర్శనలో తెలంగాణ సంప్రదాయ వస్త్రాలతో పాటు దేశంలోని చేనేతకారుల ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ చీరలతో పాటు ఫ్యాన్సీ వస్తువులను 60 స్టాల్స్‌లో ప్రదర్శిస్తున్నామని నిర్వాహకులు జయేశ్‌గుప్త తెలిపారు. ప్రదర్శన ఈనెల 25 వరకూ కొనసాగనుంది.

# ఫస్ట్ బెటాలియన్‌లో వరల్డ్ ఎర్త్ డే

ఫస్ట్ బెటాలియన్‌లో వర్మి కంపోస్ట్, వాటర్ హార్వెస్ట్ పిట్‌ను ప్రారంభిస్తున్న కమాండెంట్ మురళీకృష్ణ

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 22: యూసుఫ్‌గూడ టీఎస్ఎస్‌పీ ప్రథమ పటాలంలో సోమవారం వరల్డ్ ఎర్త్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్‌లో ఏర్పాటు చేసిన వర్మి కంపోస్ట్ అండ్ వాటర్ హార్వెస్ట్ పిట్‌ను కమాండెంట్ పి.మురళీకృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ టి.నరేందర్‌సింగ్, అసిస్టెంట్ కమాండెంట్లు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఫస్ట్ బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

### హనుమాన్ జయంతి ర్యాలీకి కట్టుదిట్టమైన భద్రత

చంద్రశేఖర్, సీఐ

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 22: నేడు జరిగే హనుమాన్ జయంతి ర్యాలీకి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నట్టు నారాయణగూడ ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం నారాయణగూడలో విజయయాత్ర రూట్‌మ్యాప్‌ను పరిశీలించి శాంతి భద్రతల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్సైలు, సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. పీఎస్ పరిధిలో ఐదుగురు సీఐలు, పది మంది ఎస్సైలతో పాటు 125మంది కానిస్టేబుల్స్, హోంగార్డులు బందోబస్తులో ఉంటారని వివరించారు.

# మాజీ మంత్రి ఇంద్రారెడ్డి సేవలు మరువలేనివి

బండ్లగూడలో ఇంద్రారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఇంద్రారెడ్డి ట్రస్ట్ చైర్మన్ కార్తీక్‌రెడ్డి

బండ్లగూడ, ఏప్రిల్ 22: దివంగత ఇంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా రాజేంద్రనగర్ డైరీఫాం వద్ద సామ ఇంద్రాపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఇంద్రారెడ్డి ట్రస్ట్ చైర్మన్ కార్తీక్‌రెడ్డి, కస్తూరి నరేందర్, కృష్ణరెడ్డి, కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్, పచ్చ శ్రీనివాస్, జీవన్‌దాస్, చిత్తారి, అదిరాల రవికుమార్ పాల్గొని ఇంద్రారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వడ్డెర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంజనేయులు ఆధ్వర్యంలో ఇంద్రారెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ నవాబ్‌ముంతాజ్, మాలాకీరత్నం, జ్ఞానేశ్వర్, మాదవ్‌రెడ్డి, మహిళలు సుహాసిని, సంధ్య, హేమలత పాల్గొన్నారు.



డైరీ ఫాం కూడలిలో కార్పొరేటర్ అర్చనజయప్రకాశ్, తదితరులు

**డీసీఎంఎస్ మాజీ చైర్మన్ శ్రావణ్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో..**

శంషాబాద్ రూరల్: పీఏసీఎస్ చైర్మన్ శ్రావణ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో పాలమాకుల గ్రామంలో మాజీ మంత్రి ఇంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేటికి యువత ఇంద్రారెడ్డిని ఆదర్శంగా తీసుకొని రాజకీయాలలోకి వస్తున్నట్లు తెలిపారు. ఆయన స్ఫూర్తిని నేటి తరం కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో పాలమాకుల మాజీ ఉప సర్పంచ్‌లు ప్రవీణ్‌గౌడ్, గూడల కిష్టయ్యగౌడ్, నాయకులు రవీందర్‌నాయక్, హుమ్లానాయక్, జుర్కి రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి,శ్రీధర్‌గౌడ్,నర్సింహలతో పాటు పలువురు పాల్గొన్నారు.

### సుల్తాన్‌పల్లి భూములు మావే..

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 22: సుల్తాన్‌పల్లి భూములను రైతులకు చెందే విధంగా చొరవతీసుకోవాలని కోరుతూ సోమవారం మాజీ వార్డు సభ్యుడు వీరచారి, యువకులు నవీన్, కశ్యప్ కుమార్ శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సంతోష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు.

**మూడో కూటమి ఏర్పాటే లక్ష్యం..**

ఖైరతాబాద్, ఏప్రిల్ 22: లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ మూడో కూటమి ప్రభుత్వ ఏర్పాటు లక్ష్యంగా పోటీ చేస్తుందని లోక్‌తంత్రిక్ జనతాదళ్ జాతీయ నాయకుడు జావిద్ రజా తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ మ్యానిఫెస్టోను రాష్ట్ర నాయకులు పి.లక్ష్మణ్‌గౌడ్, రత్నం బూరగ, చలం, విజయకుమారితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాభివృద్ధే లక్ష్యంగా తమ పార్టీ పని చేస్తుందని అన్నారు. విద్య, వైద్యం పామాన్యులకు అందుబాటులో తీసుకురావడం, ఉద్యోగాల కల్పన, మహిళా సాధికారిత, సమానత్వం లాంటి అజెండాతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.

### ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

యూసుఫ్‌గూడ కేవీబీఆర్ స్టేడియంలోని స్ట్రాంగ్‌రూమ్ వద్ద అధికారులు, నేతలు

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 22: లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని సికింద్రాబాద్ ఆర్డీఓ, జూబ్లీహిల్స్ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ దశరథ్‌సింగ్ రాథోడ్ తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు వినియోగించే 411 బ్యాలెట్ యూనిట్లు, మరో 411 కంట్రోల్ యూనిట్లు, 460 వీవీ ప్యాట్లను కట్టుదిట్టమైన భద్రత నడుమ సోమవారం యూసుఫ్‌గూడ కోట్లవిజయభాస్కర్‌రెడ్డి స్టేడియానికి తరలించి, భద్రపరిచారు. ఈఈ రాజ్‌కుమార్, డిప్యూటీ ఈఈ శ్రీరాములు పాల్గొన్నారు.

### గ్రామీణ వైద్యులపై మెడికల్ కౌన్సిల్ దాడులను ఆపాలి

ఖైరతాబాద్, ఏప్రిల్ 22: గ్రామీణ వైద్యులపై తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ దాడులను ఆపాలని ఆ సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీ, పీఎంపీలు పేదలకు వైద్యం అందిస్తూ 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఐఏఎం వైద్యులు 24గంటల పాటు అందుబాటులో ఉండే పరిస్థితి లేదని, అలాంటి తరుణంలో ఆర్ఎంపీ, పీఎంపీలే ప్రజలకు దిక్కవుతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో సంఘం నాయకులు ఎంఏ రహమాన్, యాదగిరి, ప్రదీప్‌సింగ్, ఉదయ గీత, సుమంత్‌కుమార్, రాజేశ్, నాగేశ్, సుఏశ్, సర్కార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారణ్య పాఠశాలలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

మాక్ డ్రిల్‌లో భాగంగా పాఠశాలలో పరుగెత్తుతున్న విద్యార్థులు

బండ్లగూడ, ఏప్రిల్ 22: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ విద్యారణ్య ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో అగ్ని ప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రమాదం సంభవించినప్పుడు మొదటగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మాక్ డ్రిల్ ద్వారా తెలియజేశారు. పాఠశాలలో సైరన్ మోగించి ప్రాణాలను కాపాడుకునేందకు పరుగెత్తే విధానం, నివారణకు తీసుకోవాల్సిన పరికారాలను ఏర్పాటు చేసుకోవడంపై వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనూప్‌శర్మ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులకు సూచనలు చేస్తున్న జెడీ హేమంత్

ఖైరతాబాద్, ఏప్రిల్ 22: జీహెచ్ఎంసీ ఆస్తి పన్నుల చెల్లింపు కోసం కల్పించిన ఎర్లీ బర్డ్ ఆఫర్ ఈ నెల 30తో ముగియనుందని, ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అధికారులు చొరవ తీసుకోవాలని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ హేమంత్ సూచించారు. సోమవారం జెడ్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన అధికారులకు సూచనలు చేశారు. శానిటేషన్‌పై బస్తీ యాక్షన్ ప్లాన్‌ను పకడ్బందీగా నిర్వహించాలని, గార్బెజ్ వనరేబుల్ పాయింట్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ జగన్, ఏఎంసీ, ఏఎంవోహెచ్, శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.

### అనుమతి లేకుండా వేస్తున్న బోర్‌వెల్ సీజ్

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 22: నీటి అవసరాల కోసం బోర్లు వేసుకోవాలంటే రెవెన్యూ అధికారుల నుంచి అనుమతి తప్పనిసరని, నిబంధనలకు విరుద్ధంగా బోర్లు వేస్తే చర్యలు తప్పవని ఖైరతాబాద్ తహసీల్దార్ నయీముద్దీన్ హెచ్చరించారు. సోమవారం రహ్మత్‌నగర్ డివిజన్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా వేస్తున్న బోర్‌వెల్‌ను రెవెన్యూ సిబ్బంది సీజ్ చేశారు.